క్లుప్తంగా

ఆడపిల్ల అన్ని దశలను ఆస్వాదిస్తూ ఎదగాలి

మాదాపూర్: ప్రతి ఆడపిల్ల హాయిగా, ఆనందంగా అన్ని దశలను ఆస్వాదిస్తూ ఎదగాలని న్యాక్ డైరెక్టర్ శాంతిశ్రీ పేర్కొన్నారు. మాదాపూర్‌లోని న్యాక్‌లో (నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్)లో ఆదివారం మహిళ దినోత్సవంను నిర్వహించారు. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ క్రైమ్ రేట్ ఎక్కడ తక్కువగా ఉంటుందో అక్కడే ఆడపిల్లలు ప్రశాంతంగా ఉంటారని తెలిపారు. మహిళలు ఎదిగేందుకు ప్రభుత్వం మరిన్ని అవకాశాలను, సబ్సిడీలను అందజేయాలని కోరారు.

ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు



కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ గ్రామంలోని ప్రజాశక్తి మహిళా మండలి కార్యాలయంలో ఆదివారం స్లమ్ సమాఖ్య, ఇందిర సమగ్రాభివృద్ధి సమాఖ్యల ఆధ్వర్యంలో సభ్యసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా స్లమ్ సమాఖ్య ప్రెసిడెంట్ ఇందిరారెడ్డి, ఆర్పీ సంధ్య, భాగ్యలక్ష్మి, ఆర్పీ మహేశ్వరి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి మహిళా గ్రూపు సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

సిలిండర్‌పై పెంచిన ధరను వెంటనే తగ్గించాలి

సుభాష్‌నగర్: కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్‌పై పెంచిన ధరను వెంటనే తగ్గించాలని కాంగ్రెస్ నాయకుడు శివకుమార్‌గౌడ్ అన్నారు. ఆదివారం దూలపల్లిరోడ్డులో కాంగ్రెస్ నాయకులు రాస్తారోకో నిర్వహించి కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం ధరలను విపరీతంగా పెంచుతూ పేదల నడ్డి విరుస్తోందన్నారు. ప్రజలకు మేలు చేస్తున్నామని చెప్పుకునే మోదీ ప్రభుత్వం చెప్పేవన్ని అబద్ధాలే అని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి కాంగ్రెస్ చేతిలో ఓటమి తప్పదన్నారు. రాస్తారోకోలో కాంగ్రెస్ నాయకులు ప్రసాద్, శ్రీనివాస్, శివాజీ, నరేష్, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

దూలపల్లి మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గం



కుత్బుల్లాపూర్: కొంపల్లి మున్సిపాలిటీ పరిధి దూలపల్లి గ్రామ మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం దూలపల్లి గ్రామంలోని కమిటీ హాలులో జరిగిన కార్యక్రమంలో అధ్యక్షుడిగా మంత్రి రఘునాథ్, ఉపాధ్యక్షులుగా బూర్గుబావి నర్సింగ్, బోగారం నరేష్, బర్మా శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శులుగా గరిసె శ్రీనివాస్, పొశెట్టి రాకేష్, గంగయోళ్ల శివ, కార్యదర్శులుగా బూర్గుబావి నవీన్, గరిసె మహేష్, నాయికోటి కిషోర్, ప్రచార కార్యదర్శులుగా చెలిమెల వినయ్, పూజారి మహేష్, నారాయణ, కోశాధికారిగా ఆర్.వెంకటేష్, కార్యనిర్వాహక సభ్యులుగా వరగంతం నాగరాజు, తోట సతీష్, బండారి దినేష్, ఆకుల రాజేందర్ నియమితులయ్యారు.

వైద్య శిబిరాల ఏర్పాటు అభినందనీయం



పూజిత ఎన్‌క్లేవ్‌లో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్

నిజాంపేట్: సంక్షేమ సంఘాలు ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో బాచుపల్లి పూజిత ఎన్‌క్లేవ్‌కాలనీలో ఆదివారం అసోసియేషన్ ఆధ్వర్యంలో, కిమ్స్ హాస్పిటల్ సహకారంతో నిర్వహించిన మెగా మెడికల్ క్యాంప్‌ను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ కరోనా తరువాత పూజిత కాలనీలో కిమ్స్ ఆస్పత్రి సహకారంతో 8 విభాగాల్లో వైద్య పరీక్షలు చేయడం శుభపరిణామమన్నారు. ఈ శిబిరంలో మొత్తం 500 మంది పరీక్షలు చేయించుకోగా వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్, దూళిపాళ్ల రాజేష్ చౌదరి, కాలనీ అధ్యక్షులు సుధాకర్, శరత్ బీజేపీ , శ్రీధర్‌రెడ్డి, రమేష్, వాసు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు నైతిక విలువలు నేర్పాలి



సెయింట్ ఆంథోనీ వార్షికోత్సవంలో అధ్యాపకులకు జ్ఞాపికలు అందజేస్తున్న మంత్రి మల్లారెడ్డి



ఛత్రపతి శివాజీ వేషధారణలో ఆకట్టుకున్న డైరెక్టర్ సుందర రాజు

కుత్బుల్లాపూర్: పిల్లల ఆలనా పాలన చూసేందుకు తల్లిదండ్రులు కొంత సమయం కేటాయించి నైతిక విలువలను నేర్పాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని రాష్ట్ర కార్మిక మంత్రి మల్లారెడ్డి అన్నారు. సుచిత్రలోని సెయింట్ ఆంథోనీ హైస్కూల్ 23వ వార్షికోత్సవ వేడుకలు శనివారం రాత్రి ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి మంత్రితో పాటు ఐఏఎస్ అధికారి బాల లత, పోచంపల్లి మున్సిపల్ చైర్మన్ లక్ష్మిలు ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సంస్కృతిక నృత్యాలు, ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

◆ అనంతరం మల్లారెడ్డి మాట్లాడుతూ... తల్లిదండ్రులు పిల్లలపై దృష్టిసారించి కొంత సమయం వారికి కేటాయించాలన్నారు. వారికి క్రమశిక్షణతో పాటు చదువు పట్ల అంకిత భావం పెంపొందించాలని సూచించారు.

◆ సెయింట్ ఆంథోనీ విద్యా సంస్థల చైర్మన్ నరిశెట్టి సుందరరాజు మాట్లాడుతూ... 23 సంవత్సరాల ప్రస్థానంలో పాఠశాల ఉన్నతికి అధ్యాపకుల కృషి ఎనలేనిదని అన్నారు. విద్యార్థులు సైతం చదువుల్లో ప్రతిభ కనబరుస్తూ పాఠశాలకు ప్రత్యేక గుర్తింపు తెచ్చారని పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, అధ్యాపకులకు పాఠశాల యాజమాన్యం జ్ఞాపికలు అందజేసి సత్కరించింది. ఈ కార్యక్రమంలో పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ నరిశెట్టి సరితా, ప్రిన్సిపాల్ షర్మిల క్రిస్టీ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, వివిధ పాఠశాలల కరెస్పాండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

యువత బంగారు భవిష్యత్‌కు బీఆర్‌ఎస్ కృషి



ప్రజా సమస్యలను వింటున్న ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు

దుండిగల్: తెలంగాణ ఉద్యమంలో యువత కీలక పాత్ర పోషించారని తెలంగాణ శాసన మండలి ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. ఆదివారం శంభీపూర్‌లోని కార్యాలయంలో పలువురు యువకులు ఎమ్మెల్సీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమ సమయంలో పలు జ్ఞాపకాలను ఎమ్మెల్సీ వారితో పంచుకున్నారు. ఉద్యమ సమయంలో ఎందరో బలిదానాలు చేశారన్నారు. యువత చూపిన తెగువ, ధైర్యం తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనకు దోహదం చేసిందన్నారు. ప్రత్యేక రాష్ట్రంలో యువత బంగారు భవిష్యత్‌కు బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. సన్మార్గంలో పయనించి ఉజ్వల జీవితాన్ని సొంతం చేసుకోవాలని సూచించారు.

◆ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీలు, బస్తీల ప్రజలు ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజును మర్యాదపూర్వకంగా కలిశారు. తమ ప్రాంతాల్లో మౌలిక వసతులను కల్పించాలని వినతి పత్రాలు అందజేశారు. దీనిపై స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో ఫోన్లలో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నారు.

మల్లికార్జునస్వామి ఆలయంలో కూన పూజలు



మెట్కానిగూడ అలయంలో పూజల్లో పాల్గొన్న కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

సుభాష్‌నగర్: మల్లికార్జున స్వామి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని బీజేపీ నాయకులు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. ఆదివారం గాజులరామారం మెట్కానిగూడలోని మల్లికార్జున స్వామి ఆలయాన్ని ఆయన దర్శించుకున్నారు. అనంతరం పూజలు నిర్వహించగా స్థానికులు ఆయనను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెట్కానిగూడ ప్రజలు ప్రతి సంవత్సరం మల్లికార్జునస్వామి జాతరను ఘనంగా నిర్వహించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చిన్నారులను ఒంటరిగా బయటకు పంపొద్దు



కరపత్రాలు అందజేస్తున్న స్వయం సహాయక బృందం సభ్యులు

దుండిగల్: వీధికుక్కల దాడుల నేపథ్యంలో దుండిగల్ మున్సిపల్ అధికారులు కరపత్రాల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. ఆదివారం మహిళా స్వయం సహాయక సంఘాల మహిళలు ఇంటింటికీ తిరుగుతూ వీధికుక్కల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. చిన్నారులను ఒంటరిగా బయటకు పంపొద్దన్నారు. గుంపులుగా వీధి కుక్కలు సంచరించే క్రమంలో ఏ విధంగా వ్యవహరించాలన్న విషయాలపై అవగాహన కల్పించారు.

◆ వంద శాతం ఇంటి పన్నులు వసూలు దిశగా పని చేయాలని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ సత్యానారాయణ అన్నారు. ఆదివారం బిల్ కలెక్టర్లు ఇంటింటికీ తిరుగుతూ ఆస్తి పన్ను చెల్లించని గృహ యజమానులను గుర్తించి వసూళ్లను చేపట్టారు.మార్చి 31 వరకు టార్గెట్‌ను పూర్తి చేయాలన్నారు. సకాలంలో పన్నులు చెల్లించేందుకు ప్రజలు సహకరించి మున్సిపల్ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కమిషనర్ కోరారు. అదే విధంగా దుకాణదారులు తమ ట్రేడ్ లైసెన్స్‌లను తప్పనిసరిగా క్రమబద్ధీకరించుకోవాలన్నారు. కొత్తగా దుకాణాలు ఏర్పాటు చేసుకున్న వారు ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోవాలని సూచించారు.

కరాటే చాంపియన్‌షిప్‌లో విద్యార్థుల ప్రతిభ

కుత్బుల్లాపూర్: ఎస్‌బీఆర్ మెగా కప్ ఫస్ట్ నేషనల్ లెవెల్ కుంగ్‌ఫూ కరాటే చాంపియన్‌షిప్‌లో గాజులరామారానికి చెందిన బ్లూమ్ అకాడమీ శిక్షకుడు మాస్టర్ కృష్ణ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఆదివారం కూకట్‌పల్లిలోని పుల్లూరు నారాయణదాసు ఫంక్షన్‌హాలులో జరిగిన పోటీల్లో కుమిత్ విభాగంలో దేవేందర్ మొదటి బహుమతి, లోకేష్ రెండో బహుమతి, కరాటాలో రోహిత్ ద్వితీయ బహుమతి, కాటా విభాగంలో అభిలాష్ తృతీయ స్థానాల్లో నిలవగా వారికి సినీహీరో, షావోలిన్ వారియర్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ చైర్మన్ సుమన్ తల్వార్ మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు.

'కేంద్ర ప్రభుత్వం మత విద్వేషాలు రెచ్చగొడుతోంది'



కళావతినగర్‌లో హాత్ సే హాత్ జోడో యాత్రలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి

దుండిగల్: కుల మతాలకు అతీతంగా దేశ ప్రజలను ఒకేతాటిపైకి తీసుకువచ్చేందుకు రాహుల్ గాంధీ భారత్ జోడో రెండో దశ యాత్రను చేపడుతున్నారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి అన్నారు. ఆదివారం 'హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా ఆయన మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావుతో కలిసి సూరారం డివిజన్ పరిధిలోని షాపూర్‌నగర్, కళావతినగర్, టీఎస్‌ఐఐసీ కాలనీల్లో ఇంటింటికి తిరుగుతూ ప్రచారం చేశారు.

◆ ఈ సందర్భంగా భూపతిరెడ్డి మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మతాల విద్వేషాలు రెచ్చగొడుతోందన్నారు. అదే విధంగా రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిరంకుశ పాలనతో తెలంగాణాను అప్పుల ఊబిలోని నెట్టిందన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో కేంద్ర, రాష్ట్రాల్లో సంక్షేమానికి పెద్దపీట వేశామన్నారు. కాని నేడు పాలకులకు ప్రజా సంక్షేమాన్ని విస్మరించారని ఆరోపించారు. దేశంలో శాంతి సామరస్యాలు నెలకొనాలంటే మరలా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలన్నారు.

◆ రాహుల్ గాంధీ నేతృత్వంలో కేంద్రంలో, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏర్పడబోతున్నాయని ధీమా వ్యక్తం చేశారు. రాబోయేది ప్రజా ప్రభుత్వమని భూపతిరెడ్డి స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాలను చూసి పార్టీకి మద్దతు తెలపాలని ఆయన ప్రజలను కోరారు.

◆ ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ఆర్.లక్ష్మి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, కొంపల్లి నాయకుడు బైరి ప్రశాంత్‌గౌడ్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడ ఐలయ్యగౌడ్, 128 డివిజన్ మెంబర్షిప్ ఇన్‌చార్జ్ రహ్మాన్, 129 డివిజన్ మెంబర్షిప్ ఇన్‌చార్జ్ నీలి రహ్మతుల్లా, మైనారిటీ సెల్ అధ్యక్షుడు చాంద్ పాషా, ఏఐసీసీ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర యువజన అధ్యక్షుడు ఇరుగు రాధాకృష్ణ, గిరిజన శక్తి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు జ్యోత్స్న, లాల్‌సింగ్ నాయక్, యువజన కాంగ్రెస్ నాయకులు నవీన్‌రెడ్డి, అర్కల విజయ్‌గౌడ్, బత్తుల చిరంజీవి, సేవాదళ్ చైర్మన్ నవీన్, ఎస్సీ సెల్ చైర్మన్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్యార్వీ షరీఫ్

నిజాంపేట్: గ్యార్వీ ఉత్సవాలు సర్వమత ఐక్యతకు ప్రతీకగా నిలుస్తాయని నిజాంపేట్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్ అన్నారు. ఆదివారం నిజాంపేట్ కార్పొరేషన్ 15వ డివిజన్‌లోని పత్తికుంట చెరువు వద్ద గ్యార్వీ షరీఫ్ ఉత్సవాలు జరగగా ధన్‌రాజ్‌యాదవ్‌తో పాటు కార్పొరేటర్లు గాజుల సుజాత, రవికిరణ్, కో.ఆప్షన్ సభ్యుడు సయ్యద్ సలీమ్, నిజాంపేట్ కార్పొరేషన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్‌లు హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ఆవుల జగన్‌యాదవ్, శ్రీనివాస్, 28వ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రాముయాదవ్, మైనారిటీ సభ్యులు ఖాన్, నబి, సాజన్, సలీం తదితరులు పాల్గొన్నారు.



గ్యార్వీలో డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు

నిప్పంటించుకుని వ్యక్తి ఆత్మహత్య



ఘటనా స్థలంలో వివరాలు సేకరిస్తున్న క్లూస్ టీమ్, దుండిగల్ పోలీసులు



తారకేష్ (ఫైల్)

దుండిగల్: ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో ఒంటిపై పెట్రోలు పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళం జిల్లా పలాస ప్రాంతానికి చెందిన తారకేష్, భూలక్ష్మి దంపతులు బతుకుదెరువు కోసం నగరానికి వలస వచ్చి బొల్లారం గ్రామంలో నివాసముంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కాగా తారకేష్ మార్బుల్స్ కంపెనీలో లోడింగ్, అన్‌లోడింగ్ కార్మికుడిగా చేస్తున్నాడు. మద్యం అలవాటున్న అతను రెండు రోజుల క్రితం భార్యతో గొడవ పడ్డాడు. ఈ క్రమంలో ఈ నెల 4వ తేదీన రాత్రి 7.30 గంటల సమయంలో పనిమీద వెళ్తున్నానని చెప్పి బైక్‌పై తారకేష్ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతనికి సంబంధించిన బ్యాగ్, మొబైల్‌ను ఇంటి వద్దనే వదిలిపెట్టి వెళ్లాడు.

◆ ఈ క్రమంలో ఆదివారం బహదూర్‌పల్లిలోని సాయినాథ్ సొసైటీలోని నిర్మాణ ప్రదేశంలో బైక్ కాలిపోగా ఓ వ్యక్తి మంటల్లో కాలిపోయి ఉన్నాడని స్థానికంగా వాకింగ్ చేసే వ్యక్తులు ఉదయం 10.30 గంటలకు దుండిగల్ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న క్లూస్‌టీమ్, పోలీసులు వచ్చి చూడగా మృతదేహం పూర్తి పట్టలేని విధంగా పూర్తిగా కాలిపోయి ఉంది. బైక్ నంబరు ఆధారంగా దర్యాప్తు చేపట్టగా స్విగ్గీలో పనిచేసే బుసి చంటికి చెందినదని తేలడంతో అతన్ని ఘటనా స్థలానికి పిలిపించగా మృతుడు తారకేష్‌గా నిర్ధారించారు. కాగా ఘటనా స్థలంలో ఖాళీ మజా బాటిల్ లభించడంతో పెట్రోల్ తెచ్చుకుని ఒంటిపై పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడా లేదా బైక్‌లోని పెట్రోల్ తీసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. భార్యతో గొడవ పడిన తారకేష్ క్షణికావేశంలో మద్యం సేవించి ఆపై ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.



అది ఆకలని చెప్పుకోలేదు.. అతడు ఆకలిని చంపుకోలేదు. కానీ ఆ ఇద్దరికి చెత్తకుండే ఆధారమైంది. గేదెకు ఆహారం దొరకక ప్లాస్టిక్ కవర్లను తింటూ కడుపు నింపుకుంటుంటే... ఆ వ్యక్తికి ఉపాధి దొరకక ఆవే ప్లాస్టిక్ కవర్లను ఏరుకుంటూ కనిపించాడు. పైనున్న చిత్రంలోని దృశ్యం మనకు ఎన్నో భావాలను తెలుపుతోంది. అదే విధంగా మన సమాజానికి ఎన్నో ప్రశ్నలనూ సంధిస్తోంది. ఈ చిత్రంలోని ఓ దృశ్యం కూటి కోసమైతే.. మరొకటి కూలి కోసం ఆ వ్యక్తి పడుతున్న ఆరాటాన్ని తెలియజేస్తోంది. ఈ దృశ్యం జగద్గిరిగుట్ట రింగ్‌బస్తీలో ఆదివారం 'సాక్షి'కెమెరాకు చిక్కింది. – జగద్గిరిగుట్ట

అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు



కొంపల్లి 6వ వార్డులో ప్రగతియాత్ర నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్, చైర్మన్ శ్రీశైలంయాదవ్

కుత్బుల్లాపూర్: భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. ఆదివారం ప్రగతి యాత్రలో భాగంగా కొంపల్లి మున్సిపాలిటీ 1వ వార్డులోని అపర్ణ పామ్ మిడోస్, అపర్ణ పామ్ గ్రూప్స్, 6వ వార్డులలో మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్‌తో కలిసి ఆయన పర్యటించారు. అపర్ణ పామ్ గ్రూప్స్‌లో నెలకొన్న సమస్యలతో పాటు 6వ వార్డులో డ్రైనేజీ ఔట్‌లెట్ సమస్యను పరిశీలించారు. అనంతరం పార్క్‌ను సందర్శించారు.

– ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజల కోసమే ప్రగతి యాత్ర చేపట్టామన్నారు. పురపాలక శాఖామంత్రి కేటీఆర్ సహకారంతో నియోజకవర్గంలో కోట్లాది రూపాయల నిధులను వెచ్చించి ఫ్లైఓవర్ల నిర్మాణ పనులు చేపడుతున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో కొంపల్లి మున్సిపాలిటీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామన్నారు.

◆ అదే విధంగా దూలపల్లి గ్రామంలోని శ్రీమల్లికార్జునస్వామి జాతరలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ గంగయ్య నాయక్, కౌన్సిలర్లు పూజారి వసంత, సన్న రవియాదవ్, పీఏసీఎస్ డైరెక్టర్ బూర్గుబావి సత్యనారాయణ, మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, సీనియర్ నాయకులు దేవేందర్‌యాదవ్, సంగీత, శారద, లక్ష్మణ్, మహేష్‌యాదవ్, యాదగిరి, బర్మ రాజు, వేణు యాదవ్, శ్రీకాంత్, నాగరాజు, సన్న రాజు, శన్ను, విమల్ తదితరులు పాల్గొన్నారు.

8 నుంచి సప్తమ వార్షికోత్సవాలు



శ్రీరేణుక ఎల్లమ్మ, నాగదేవత ఆలయ వార్షికోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

రంగారెడ్డినగర్: రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి ఏపీ హెచ్‌బీ కాలనీలోని శ్రీరేణుక ఎల్లమ్మ తల్లి, శ్రీనాగదేవత ఆలయ సప్తమ వార్షికోత్సవాలు ఈనెల 8 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ నాగారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలో వార్షికోత్సవ పోస్టర్‌ను ఆలయ కమిటీ, కాలనీ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ప్రతిఏటా ఘనంగా నిర్వహించే ఆలయ వార్షికోత్సవాలకు హాజరయ్యే భక్తులకు అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

◆ వార్షికోత్సవాల్లో భాగంగా 11వ తేదీ శనివారం ఉదయం విశేష హోమాలు, ఉదయం 9.13 గంటలకు ధ్వజస్తంభ కలశ యంత్ర ప్రతిష్ఠాపన అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవార్ల కృపకు పాత్రులు కాగలరని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ వైస్‌చైర్మన్ పరుచూరి ప్రేమ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పి.వెంకటసుధాకర్‌రావు, కోశాధికారి కె.రమణయ్య, ఆలయ ప్రధానార్చకులు కె.రవితేజాచార్యులు, కాలనీ అధ్యక్ష, కార్యదర్శులు ఏ.సాయికిరణ్, జీఎం జయరావు, పోపూరి జగన్‌మోహన్‌రావు, షేక్ శ్రీను బాషా తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్యశిబిరానికి హాజరైన రోగులకు మందులు అందజేస్తున్న కార్పొరేటర్ జగన్

జగద్గిరిగుట్ట: ఉచిత వైద్య శిబిరాలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జగద్గిరిగుట్ట కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. ఆదివారం మగ్దూమ్ నగర్‌లోని కార్పొరేటర్ కార్యాలయంలో మెడిటెక్ సౌజన్యంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ శిబిరంలో సుమారు 200 మందికి షుగర్, థైరాయిడ్, బీపీ, జనరల్ పిజీషియన్, గైనకాలనీ తదితర వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు గోపికృష్ణారెడ్డి, నితిన్‌రెడ్డి, శృతిపాటిల్, రవి కిషోర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు కొలుకు జైహింద్, బాబుగౌడ్, వెంకట్‌రెడ్డి, మురళి, గణేష్ ఆజాం, యాదగిరి, నరసయ్య, నర్సింగ్, సంతోష్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

స్త్రీ శక్తి ఎంతో గొప్పది.. స్త్రీ లేనిదే సృష్టి లేదు

రంగారెడ్డినగర్: సమాజంలో స్త్రీ శక్తి ఎంతో గొప్పదని.. స్త్రీ లేనిదే సృష్టి లేదని ప్రముఖ పారిశ్రామికవేత్త, శ్రీలలితా పరమేశ్వరి దేవాలయ అధ్యక్షుడు లయన్ డాక్టర్ చిల్లా రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ప్రపంచ మహిళా దినోత్సవం పురస్కరించుకుని ఆదివారం రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని పంచశీల కాలనీ రాజ్యలక్ష్మి ఇండస్ట్రీస్ కార్యాలయంలో ప్రగతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నేడు పురుషులతో సమానంగా స్త్రీలు అన్ని రంగాలలో రాణించడం హర్షించదగ్గ విషయమన్నారు. మహిళలు స్వశక్తితో ఎదిగినప్పుడే సమాజంలో గౌరవ మర్యాదలు దక్కుతాయన్నారు.

◆ ప్రముఖ సామాజికవేత్త డాక్టర్ రత్నప్రభ, బీసీ సంఘం రాష్ట్ర మహిళ నాయకురాలు మహియారాజ్‌యాదవ్ మాట్లాడుతూ.. విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో తమదైన శైలిలో మహిళలు ముందుకు వస్తు ప్రతిభ కనబరుస్తున్నారన్నారు. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా ముందుకు సాగాలని, సామాజిక సేవాభావాలు అలవర్చుకొని పేదవారికి తోచినంతలో సహాయం చేయాలని సూచించారు. అనంతరం పలు రంగాలలో ప్రతిభ కనబరుస్తున్న మహిళలకు ప్రగతి ఫౌండేషన్ నిర్వాహకులు డాక్టర్ ఆరిఫుద్దీన్ నేతృత్వంలో శాలువాలతో ఘనంగా సన్మానించి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ జూబ్లీహిల్స్ ప్రతినిధి కొల్లూరి శ్రీదేవి, వివిధ రంగాల మహిళ ప్రతినిధులు నిర్మల, సుష్మ కుమారి, సారా షేక్, శాంతి వికలాంగుల సంఘం అధ్యక్షురాలు భ్రమరాంభిక, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు సమీర్, సంఘ సేవకులు ఎం.వెంకటేశ్వర్‌రెడ్డి, మహిళా కార్మికురాలు వెంకట లక్ష్మి, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభ కనబరుస్తున్న మహిళలకు ప్రశంసపత్రాలు అందజేస్తున్న చిల్లా రాజశేఖర్‌రెడ్డి